## ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త
# సైనికుడిలా పనిచేసి గెలిపించాలి


కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

**కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్**

**ఆల్విన్‌కాలనీ:** శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు మధులత, సీనియర్ నాయకులు బాలస్వామి, మోజెస్, పోశెట్టి గౌడ్, యాదగిరి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నేత రామకృష్ణగౌడ్, అగ్రవాసు, సంగమేష్, రాజు, అరుణ, బాలస్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**వివేకానందనగర్ డివిజన్‌లో..**

కాంగెస్‌పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి రామకృష్ణనగర్‌కు చెందిన శివరాత్రి రవికుమార్, శివరాత్రి భారతమ్మ, స్వామి తదితరులు వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.


కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

# కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తన నివాసం వద్ద బీఆర్ఎస్ ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. వాడవాడలా ప్రచారం ముమ్మరం చేస్తామన్నారు. కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన్న ఇద్దరు నేతలు ఇప్పుడు పార్టీ మారి పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో కూకట్‌పల్లి ఎంతో అభివృద్ధి చెందింది

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మల్కాజ్‌గిరి లోకసభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎన్నో వేల కోట్ల రూపాయల అభివృద్ధితో గత పదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ కార్పొటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, సబిహా బేగం, పగుడాల శిరీష బాబురావు, మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహయాదవ్, మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, సంతోష్, భిక్షపతి, ప్రభాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, సురేష్ యాదవ్, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, దర్శనం శాఖయ్య, సెక్రటరీలు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు

# రూ.కోట్ల భూములు కబ్జా!

**పట్టించుకోని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు**

**మోతీనగర్:** కూకట్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నం.1007లో 360 ఎకరాల స్థలానికి సంబంధించి దాదాపు 3600 గజాల స్థలంపై వివాదం నెలకొంది. దీనిపై పర్వత్‌నగర్ బ్యాంకర్స్ కాలనీకి చెందిన ఓవర్ ల్యాపింగ్ భూమిని ఆక్రమించి భారీ ఎత్తున షెడ్డు నిర్మాణంతో పాటు కాలనీలో ఉన్న గుడికి సంబంధించిన స్థలాన్ని సైతం కబ్జాదారులు కబ్జాకు యత్నిస్తున్నారని పర్వత్‌నగర్ కాలనీవాసులు వాపోయారు. భూమి ఆక్రమణకు గురి కాకుండా కొట్లాడుతుంటే తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోవటం లేదంటూ వాపోయారు. ఇప్పటికైనా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వివాదంపై అధికారులు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.సుంకన్న, కనకయ్య మదిరాజ్, నార్లపురం శ్రీనివాస్, ఆదిరెడ్డి, గోనెల సుదర్శన్ ముదిరాజ్, దేవరెంటి మస్తాన్‌రెడ్డి, శ్రీరాము తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్‌టీఎల్ జోన్లు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

**లేక్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో జెడ్‌సీ**

**కూకట్‌పల్లి:** జీహెచ్ఎంసీ లేక్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై ఆదేశాలు జారీ చేశారు. బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్లు ఆక్రమణకు గురైతే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేక్ ఇన్‌చార్జీలు తమకు కేటాయించిన చెరువులను ప్రతి రోజు సందర్శించాలని ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఏదైనా శిథిలాలు, ఆక్రమణలు ఉన్నట్లు గుర్తిస్తే లేక్ రిజిస్టర్‌లో అందుకు సంబంధించి విషయాలను సక్రమంగా అందించాలన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.

◆ ఏఎంఓహెచ్‌లు చెరువులో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఏదైనా అనధికార నిర్మాణాలు వస్తే సంబంధిత సర్కిల్ ఏసీపీలు బాధ్యత వహిస్తారన్నారు. కూకట్‌పల్లి జోనల్‌లోని చెరువుల ఆక్రమణలను అరికట్టాలని సంబంధిత అన్ని శాఖల అధికారులు నీటి పారుదల, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు పరస్పరం సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి జోన్ సూపరింటెండ్ ఇంజినీరు పి.చిన్నారెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, సిటీ ప్లానర్ కె.ఉమాదేవి, కూకట్‌పల్లి మండలం ఈఈలు, ఏసీపీలు, ఏఎంఓహెచ్‌లు, నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు, ఏఎంసీ శ్రీకాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ లేక్ ప్రొటెక్షన్ సెల్ సెల్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ అభిలాష అభినవ్, అధికారులు

## ఈటల రాజేందర్
# లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారు



బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు

**కూకట్‌పల్లి:** మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. బాలాజీనగర్ డివిజన్‌లోని ఓల్డ్ బాలాజీనగర్‌కాలనీ, శ్రీసంజీవని హనుమాన్ దేవాలయం నుంచి ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈటల గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలోని నేతలందరం కలిసి కట్టుగా పని చేస్తున్నారని అన్నారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కడతామని ప్రజలు తమకు చెబుతున్నారని అన్నారు. మోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం కాంతారావు, సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పద్మయ్య, కొడిచెర్ల మహేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మార్పు కోసం ఈటల రాజేందర్‌ను గెలిపించాలి : ఉప్పల దామోదర్**

**మోతీనగర్:** మంచి మార్పు కోసం బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించుకోవాలని తులసీనగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల దామోదర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు అనే ఆయుధాన్ని అమ్ముకొని మనల్ని మనం మోసం చేసుకోవద్దన్నారు. ఒక బాధ్యత కలిగిన మనిషిగా మన ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజా సేవ చేయడానికి బీసీ బిడ్డగా ఈటల రాజేందర్ మన ముందుకు వస్తున్నారని అన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**గడపగడపకు బొట్టుపెట్టి.. ఓటు వేయాలని అభ్యర్థించి**

**మోతీనగర్:** మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా తులసీనగర్‌లో సోమవారం పులిగొల్ల శ్రీలక్ష్మి యాదవ్ ప్రచారం నిర్వహించారు. గడపగడపకు బొట్టుపెట్టి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి బీజేపీకి మద్దతు తెలపాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కొర్రపాక వసంత, నిర్మల, పూరిత, శ్రావణి, లక్ష్మీ, సుజాత, రాధా, మౌనిక, అన్నపూర్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


తులసీనగర్‌లో ప్రచారం చేస్తున్న పులిగొల్ల శ్రీలక్ష్మీయాదవ్ తదితరులు

**రేపటి నుంచి శ్రీరామ నవమి మహోత్సవాలు**

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నవాహ్నిక బ్రహ్మోత్సవ ప్రయుక్త శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవం 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ, 18వ తేదీ ఉదయం 11 గంటలకు సామ్రాజ్య పట్టాభిషేకం, 23వ తేదీ పౌర్ణమి సాయంత్రం 6.30 గంటలకు రథోత్సవం, 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అష్టోత్తర శత కలశాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సీతారామ కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

**పేకాట స్థావరంపై పోలీసుల దాడి**

**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీకాలనీలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న పలు స్థావరాలపై బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. స్నేహితులంతా కలిసి కేపీహెచ్‌బీ కాలనీలో రత్నదీప్ బిల్డింగ్‌లో పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 35వేల రూపాయల నగదును, 9 సెల్ ఫోన్లు, 10 కార్డు సెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఓటీ పోలీసులు కేసును కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య**

**మూసాపేట:** ఫ్యానుకు ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాంనగర్ గ్రామం, పాపన్నపేట్ మండలం, మెదక్ జిల్లాకు చెందిన లంగడి రమేష్ (20) కూకట్‌పల్లి ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతని అన్న లంగడి ప్రసాద్ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. తల్లిదండ్రులు జగద్గిరిగుట్టలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు తువ్వాలుతో ఉరివేసుకొని చనిపోయాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు కానీ, వ్యక్తిగత సమస్యల వల్ల చనిపోయినట్లు అతని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## అంగరంగ వైభవంగా
# వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీవారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, భక్తులు

**ఆల్విన్‌కాలనీ:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి బ్రహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వివేకానందనగర్ కాలనీలోని శ్రీమదలర్మేల్ మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధానార్చకులు రామకృష్ణమాచార్యులు నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దంపతులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, ఆలయ పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వి.రంగరాజు, టి.సీతారామారావు, పెంచలయ్య, ఆంజనేయరెడ్డి, విజయబాబు, బాపయ్య చౌదరి, అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, శ్రీమన్నారాయణచార్యులు, శ్రీనివాసచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** ఎల్లమ్మబండ కమలమ్మ కాలనీలో నిర్మించిన అభయ వీరాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ఈ పూజల్లో ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కాశీనాథ్‌యాదవ్, జోగిపేట భాస్కర్, చిన్నోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జగద్గురు భారతితీర్థ మహాస్వామి వార్షిక వర్ధంతి


వార్షిక వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ ముదిగొండ శంకరాశర్మ తదితరులు

**మోతీనగర్:** భారతదేశం కర్మభూమి అని బ్రహ్మశ్రీ ముదిగొండ శంకరాశర్మ పేర్కొన్నారు. సువర్ణభారతి మహోత్సవంలో భాగంగా సోమవారం మోతీనగర్‌లోని శంకరమఠం ఆవరణలో జగద్గురు శ్రీభారతి తీర్థ మహాస్వామి 74వ వార్షిక వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుపాదుక పూజ, ఆది శంకరాచార్యుల అష్టోత్తర నామార్చన, రుద్ర ఆయుష్ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిగొండ శంకరాశర్మ మాట్లాడుతూ.. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, దేవి నవరాత్రి, శివరాత్రి, వినాయక చవితి వంటి పండుగలు మన భారతదేశంలోనే జరుపుకుంటామన్నారు. జగద్గురు శ్రీ భారతి తీర్థ స్వామి వర్ధంతి, జయంతి వేడుకలు కూడా ఆ విధంగానే నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహణాధికారి సీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమికి మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్‌పల్లి:** శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కూకట్‌పల్లి రామాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేచాలన్నారు. అదేవిధంగా వేసవి తాపం వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా కూలర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చైర్మన్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.


రామ నవమి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

**రేపు శ్రీరామ నవమి వేడుకలు**

**మోతీనగర్:** అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలో పలు దేవాలయాలు, పలు ప్రాంతాల్లో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. 17వ తేదీ ఉదయం 10గంటలకు మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీరామ కల్యాణం జరుగుతుందన్నారు. మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు ఓ ప్రకటనలతో తెలిపారు.

◆ పర్వత్‌నగర్‌లోని పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 11గంటలకు పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ కల్యాణం మహా వైభవంగా జరుగుతుందని తెలిపారు. – అనంతరం ఒంటిగంటకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 7గంటలకు శ్రీరామ నామస్మరణ, రామభజన, పల్లకి సేవ, ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

◆ కబీర్‌నగర్ అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించనుననట్లు ఆలయ సేవకులు ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేది ఉదయం 8గంటలకు మూలమూర్తులకు అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, అంకురారోహణము, కుంభస్థాపన, ఎదుర్కోలు, పసుపు దంచుట (కొట్నాలు), 17వ తేదీ ధవారం అభిజిత్ లగ్నంలో 11.45కు శ్రీసీతారామ కల్యాణం, 18వ తేది గురువారం ఉదయం శ్రీరామ పట్టాభిషేకం, 108 కలశాలతో అభిషేకం చక్రవర్తి సమర్పణ, ఆయుధ సమర్పణ, మహా ఆశీర్వచనం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

◆ పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు. బుధవారం శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణం, 8గంటలకు స్వామివార్ల ఊరేగింపు, 9 గంటలకు ఎదుర్కోలు, 10 గంటలకు కల్యాణం, 12 గంటలకు అన్నదానం, 23వ తేదీ ఉదయం 6 గంటలకు హనుమత్ దీక్ష ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**అక్రమ నీటి ప్లాంట్లు సీజ్**


పాపిరెడ్డినగర్‌లో అక్రమ నీటి ప్లాంట్లను సీజ్ చేస్తున్న అధికారులు

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో గత కొన్నేళ్లుగా భూగర్భ జలాలను తోడేస్తు లక్షల లీటర్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమ వాటర్ ప్లాంట్‌లపై సోమవారం సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించారు. పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బస్తీవాసులతో కలిసి గత ఆదివారం పెద్ద ఎత్తున చేపట్టిన నిరసన, దీక్షలతో అధికారులు స్పందించారు. సోమవారం అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేశారు. అధికారుల నిబంధనలు అతిక్రమించి ప్లాంట్లను కొనసాగిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. అధికారులకు బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

**శ్రీవారికి పాదపద్మముల అందజేత**

**మూసాపేట:** భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామికి 3.5కిలోల వెండితో తయారు చేసిన శ్రీవారికి పాదపద్మములను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ దంపతులు సోమవారం అందజేశారు. పురోహితులు స్వామివారి పాదపద్మములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు.


పాదపద్మములు అందజేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

**సాయిబాబా, దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం**

**మోతీనగర్:** తులసీనగర్ సంక్షేమ సంఘం, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ కనకదుర్గా సహిత ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం సాయిబాబా, దత్తాత్రేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. మండపం, కలశం దాత లక్కపాగు యాదమ్మ, వెంకటేష్‌లు, విగ్రహ దాత గండి స్రవంతి, రవికాంత్‌లు, భక్తుల సహకారంతో పురోహితులు గట్టు రంగాచార్యుల ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సామ కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి శ్రీనివాస్, సలహాదారులు బంగారు, శేఖరాచారి, ఉపాధ్యక్షులు రాములు, ఎల్లయ్య, సంయుక్త కార్యదర్శులు హనుమంతు, సురేందర్, లక్ష్మణ్ కమిటీ సభ్యులు శ్రీ శైలం, కిషన్, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

**ఐఎన్‌టీఎస్‌డీ ఫలితాల్లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు**


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

**కూకట్‌పల్లి:** ఐఎన్‌టీఎస్‌డీ పరీక్షలలో సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు సోమవారం ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి బహుమతిగా లెనోవా ట్యాబ్, మూడో, ఐదో ర్యాంకులతో పాటు 42 మంది విద్యార్థినులు బంగారు పతకాలను, 10 మంది విద్యార్థినులు ప్రోత్సాహక బహుమతులు పొందారు. 79 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారు. వీరికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, పాఠశాల కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, శివరామ్, డీన్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.